రైతన్నా .. భూసారం తెలుసుకో !

- ప్రతి ఆర్‌బీకే పరిధిలో మట్టి నమూనాల సేకరణకు చర్యలు
- ఇప్పటికే సిబ్బందికి శిక్షణ పూర్తి
- ఖరీఫ్ నాటికి ఫలితాలు రైతాంగానికి అందించేలా వ్యవసాయ శాఖ ప్రణాళిక



మట్టి నమూనాల సేకరణపై వ్యవసాయ సహాయకులకు శిక్షణ

ప్రత్తిపాడు: సాగులో ఆశించిన స్థాయిలో దిగుబడులు రావాలన్నా.. భూమిలో ఏ పంట సాగు చేస్తే బాగుంటుందో.. ఎరువుల్ని ఏ మోతాదులో వాడితే వ్యవసాయం లాభసాటిగా ఉంటుందో తెలియాలంటే అత్యంత కీలకమైనది భూసార పరీక్ష. ఖరీఫ్‌కు ముందే రైతుల పొలాల్లో మట్టి నమూనాలను సేకరించేందుకు వ్యవసాయ శాఖ సన్నద్ధమయ్యింది. రానున్న ఖరీఫ్‌లో నియోజకవర్గంలోని ప్రత్తిపాడు, పెదనందిపాడు, కాకుమాను, వట్టిచెరుకూరు, గుంటూరు రూరల్ మండలాల్లో మొత్తం సుమారు 61 వేల ఎకరాల్లో రైతులు పంటలు సాగు చేయనున్నట్లు వ్యవసాయశాఖ అంచనా వేస్తోంది.

ప్రతి రైతు భరోసా కేంద్రం పరిధిలో ఏర్పాట్లు

ప్రతి రైతు భరోసా కేంద్రం పరిధిలోనూ మట్టి నమూనాల సేకరణ ప్రక్రియ జరగనున్నట్లు అధికా రులు చెబుతున్నారు. ఒక్కో ఆర్‌బీకే నుంచి సుమా రు యాభై నమూనాల్ని అగ్రికల్చర్ అసిస్టెంట్లు సేకరించే అవకాశాలున్నాయి. వీటి ఫలితాల్ని సైతం సకాలంలో రైతులకు అందించేలా యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది. ప్రయోగశాలల్లో మట్టి నమూనాలను పరీక్షించి కర్బనం, నత్రజని, భాస్వరం, పొటాష్, గంధకం, సున్నంలు ఏస్థాయిలో ఉన్నాయో నిర్ధారిస్తారు. ఇప్పటికే ట్రయల్ బేస్‌గా ప్రతి ఆర్‌బీకే నుంచి రెండు శాంపిల్స్‌ను సేకరించారు. నియోజకవర్గంలో మొత్తం 60కు పైగా ఆర్‌బీకేలు ఉన్నాయి.

మట్టి నమూనాల సేకరణ ఇలా..

మట్టి నమూనాలను పైరు కోయగానే వేసవి కాలంలో శాస్త్రీయ పద్ధతిలో సేకరించాల్సి ఉంటుంది. పొలంలో ఎనిమిది నుంచి 10 చోట్ల నేలను శుభ్రం చేసుకుని 'వి' ఆకారంలో 15 సెం.మీ లోతులో గుంత తీయాలి. అక్కడ నుంచి పై నుంచి కిందకు అంగుళం మందంలో 2.5 సెం.మీ. లోతు వచ్చేలా మట్టిని 'వి' ఆకారంలో రెండు వైపులా తీయాలి. వచ్చిన కాంపోజిట్ మిశ్రమాన్ని ముందు నాలుగు భాగాలుగా, తరువాత రెండు భాగాలుగా విభజించి 500 గ్రాముల మట్టిని సేకరించి శుభ్రమైన క్లాత్‌లో భద్రపరచాలి. సేకరించిన మట్టి నమూనాలను ఆయా నియోజకవర్గాల్లో ఏర్పాటు చేసిన అగ్రిల్యాబ్‌లకు పంపి పరీక్షలను నిర్వహిస్తారు.

మట్టి నమూనాలు ఎందుకు ?

పైర్లకు కావలసిన అన్ని పోషకాలు కొంత పరిమాణంలో సహజంగానే నేలలోనే ఉంటాయి. నేల భౌతిక, రసాయన లక్షణాలు, సూక్ష్మజీవుల చర్య, వాతావరణ పరిస్థితులపై వీటి లభ్యత ఆధారపడి ఉంటుంది. కొన్ని నేలల్లో వీటిల్లో తేడా ఉండే అవకాశం ఉంది. అందువల్ల సాగు చేయాల్సిన పైరుకు ఎంత మోతాదులో ఎరువులు అవసరమో నిర్ధారించేందుకు ఈ పరీక్షలు తప్పనిసరి.

నేరుగా రైతు మొబైల్‌కే సందేశం

భూసార పరీక్షల నివేదికల ఆధారంగా రైతులు ఏ ఎరువును ఎంత మోతాదులో వినియోగించాలి? ఏ పంట సాగు చేస్తే ఫలితాలు బాగుంటాయి? అనే వివరాల్ని ప్రత్యేకంగా రూపొందించిన సాఫ్ట్‌వేర్ ద్వారా నేరుగా రైతు మొబైల్‌కే సందేశం వెళుతుంది. మట్టి సేకరణతో పాటు ఇందుకు సంబంధించి సమగ్ర ప్రక్రియపై ఈ నెల 12 నుంచి 17 వరకు మట్టి పరీక్షల వారోత్సవాలను కూడా నిర్వహించి, రైతు భరోసా కేంద్రాల్లోని వ్యవసాయ సిబ్బందికి ప్రభుత్వం ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించింది.

టార్గెట్లు రాగానే మట్టి నమూనాల సేకరణ



భూసార పరీక్షలకు సంబంధించి ప్రతి ఆర్‌బీకే నుంచి ఎన్ని శాంపిల్స్ సేకరించాలనే దానిపై ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రావలసి ఉంది. టార్గెట్ వచ్చిన వెంటనే సేకరిస్తాం. వారోత్సవాల సమయంలో ఇప్పటికే శిక్షణ కూడా సిబ్బందికి ఇచ్చాం . భూసార పరీక్షలతో రైతులకు ఎంతో మేలు చేకూరుతుంది.

–జి. శ్రీనివాసరావు (ఏడీఏ, గుంటూరు)

పంటకు అనేక ప్రయోజనాలు

- ఏ రకం ఎరువులు ఎంత మోతాదులో వాడాలనేది తెలుస్తుంది.
- అవసరం లేని పోషకాల ఎరువులను వెయ్యకుండా వృథా అరికట్టవచ్చు.
- ఎరువులను అవసరం మేర సమతులంగా వాడటం ద్వారా పైరు ఆరోగ్యంగా పెరుగుతుంది.
- చీడపీడలు తక్కువగా ఆశించడంతో పంట నాణ్యత పెరుగుతుంది.
- అధిక దిగుబడులు వస్తాయి.

పార్టీలకు అతీతంగా అర్హులందరికీ 'నవరత్నాలు'

- పొన్నూరు శాసనసభ్యుడు కిలారి వెంకట రోశయ్య
- పొన్నూరు 8వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం



గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో శాసనసభ్యుడు కిలారి వెంకట రోశయ్య

పొన్నూరు(చేబ్రోలు): రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనలో కుల, మత, పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ నవరత్న పథకాలు అందిస్తున్నట్లు పొన్నూరు శాసనసభ్యుడు కిలారి వెంకట రోశయ్య తెలిపారు. పొన్నూరు పట్టణంలోని 8వ వార్డులో బుధవారం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా అందిన లబ్ధిని తెలియజేశారు. స్థానికులు తెలియజేసిన సమస్యల్ని నమోదు చేసుకొని, సత్వరం పరిష్కరించాలని అధికారుల్ని ఆదేశించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో కిలారి వెంకట రోశయ్య మాట్లాడుతూ పేదల అభ్యున్నతే లక్ష్యంగా ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పని చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ పథకాల్ని పారదర్శకంగా లబ్ధిదారులకు అందజేసేందుకు, అవినీతి రహిత పాలన కొనసాగించేందుకు ముఖ్యమంత్రి వినూత్న రీతిలో పరిపాలన సాగిస్తున్నారని చెప్పారు. మహాత్మాగాంధీ కలలు గన్న గ్రామ స్వరాజ్యం, గ్రామ సచివాలయ పరిపాలనను ముఖ్యమంత్రి అమలు జరపడంతో దేశవ్యాప్తంగా గుర్తింపు లభించిందని పేర్కొన్నారు. ప్రజలకు అందించే ప్రతి సంక్షేమ పథకాన్ని వలంటీర్ల ద్వారా వారి ఇంటికి ముంగిటికే వచ్చి అందిస్తున్నామని తెలిపారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన కొన్ని సమస్యల్ని ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య అక్కడిక్కడే పరిష్కరించారు. మార్కెట్టు యార్డు చైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు మూకిరి అనీలాకుమారి, నక్కా కృష్ణ, భవనం వంశీరెడ్డి, రుద్రపాటి ఆదిశేషు, వివిధ శాఖల అధికారులు, మున్సిపల్ అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

జన్మభూమి కాలనీ ప్రధాన రహదారికి మహర్దశ



గుంటూరు రూరల్: ఏళ్ల తరబడి ఇబ్బందులు పడుతున్న జన్మభూమి కాలనీవాసుల ప్రధాన రహదారి ఇబ్బందులు నేటితో తొలగనున్నాయి. స్థానిక 40వ డివిజన్ కార్పొరేటర్ ఏరువ సాంబిరెడ్డి చొరవతో తారు రోడ్డు నిర్మాణానికి బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ కాలనీ ఏర్పడి 30 సంవత్సరాలు అవుతున్నా గత ప్రభుత్వాలు నివాసితుల సమస్యల్ని పట్టించుకోలేదని తెలిపారు. ముఖ్యమంత్రిగా వై.ఎస్. జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత కాలనీలో అన్ని అంతర్గత రోడ్లు సీసీ రోడ్లుగా నిర్మించినట్లు చెప్పారు. డ్రెయిన్ల నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. కాలనీ వాసుల ఆరోగ్య భద్రత కోసం అర్బన్ హెల్త్ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. తారు రోడ్డు నిర్మాణానికి రూ. 31 లక్షలతో శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. శివారు కాలనీల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయిస్తోందని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పిల్లి నాగేశ్వరరావు, బంగారయ్య, బాబు, అప్పారావు, అనిల్, రాజు, ముత్యాల శ్రీనివాసరావు, కార్పొరేషన్ అధికారులు పాల్గొన్నారు.

సందడిగా పాఠశాల వార్షికోత్సవం



ఎంఈఓకి స్వాగతం పలుకుతున్న విద్యార్థులు

లింగంగుంటపాలెం(కాకుమాను): మండలంలోని లింగంగుంటపాలెం మండల పరిషత్ (స్పెషల్)ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎంఈఓ కె.ఎఫ్.కెనడీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు ఆనంద నిలయాలని పేర్కొన్నారు. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు విద్యార్థులకు విలువలతో కూడిన నాణ్యమైన గుణాత్మక విద్యను అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం పి.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు నాగమణి, సౌజన్య, సీఆర్పీ వై.చలపతిరావు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా 'జగనన్నే మా భవిష్యత్తు'



ప్రత్తిపాడులో నేతల ప్రచారం

ప్రత్తిపాడు: జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమానికి గ్రామాల్లో విశేష స్పందన లభిస్తోంది. సచివాలయ కన్వీనర్ల ఆధ్వర్యంలో పార్టీ నాయకులు సైతం ఇంటింటికీ తిరుగుతూ నూతనోత్సాహంతో ముందుకు సాగుతున్నారు. నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడు-3 సచివాలయ పరిధితో పాటు నిమ్మగడ్డవారిపాలెం, కోయవారిపాలెం గ్రామాల్లో బుధవారం కార్యక్రమాన్ని పార్టీ నాయకులు నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి జగనన్నే మా నమ్మకం స్టిక్కర్లు, కరపత్రాలను అందించారు. పథకాల తీరును అడిగి తెలుసుకున్నారు.

వడ్డిముక్కలలో ఇంటింటికీ ప్రచారం

పొన్నూరు(చేబ్రోలు): పొన్నూరు మండలం వడ్డిముక్కలలో బుధవారం నేతలు ప్రచారం చేశారు. మా నమ్మకం నువ్వే జగన్ ...మా భవిష్యత్తు జగనన్నే కార్యక్రమంలో భాగంగా వైఎస్సార్ సీపీ నేత వడ్రాణం రవి సుధాకర్ ఆధ్వర్యంలో గృహ సారథులు, వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, పార్టీ శ్రేణులు ఇంటింటికీ వెళ్లారు. గత ప్రభుత్వానికి, ప్రస్తుత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి మధ్య ఉన్న వ్యత్యాసాన్ని వివరించారు. గడప గడపకూ మా నమ్మకం జగన్ స్టిక్కర్లు, మొబైల్ స్టిక్కర్లును అంటించారు. కార్యక్రమంలో పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రేపు విజ్ఞాన్ నిరులాలో తల్లిదండ్రులకు ఆత్మీయ సన్మానం

గుంటూరు రూరల్: ఈ ఏడాది తమ విద్యార్థులు అధిక వేతనాలతో ఉద్యోగాలు సాధించారని విజ్ఞాన్ నిరులా మహిళా ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రాధిక వెల్లడించారు. బుధవారం పెదపలకలూరు రోడ్డులోని కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఉద్యోగాలు సాధించిన విద్యార్థుల తల్లిదండ్రులకు ఈ నెల 21వ తేదీన కళాశాల ప్రాంగణంలో ఘనంగా సన్మానించనున్నట్లు పేర్కొన్నారు. ఈ ఏడాదిలో బీటెక్ పూర్తి చేసుకుంటున్న విద్యార్థుల్లో 90 శాతం ఉద్యోగాలు సాధించారని తెలిపారు. అత్యధికంగా రూ. 44 లక్షలు, రూ. 22లక్షల వేతనాలతో ఉద్యోగాలు సాధించారని ఆమె వెల్లడించారు. పలువురు మంచి వేతనాలతో బహుళ జాతి సంస్థల్లో ఉద్యోగాలు పొందారని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు విజ్ఞాన్ సంస్థల చైర్మన్ లావు రత్తయ్య, విజ్ఞాన్ సంస్థల వైస్ చైర్మన్, ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు శుభాకాంక్షలు తెలిపారు.

ప్రశంసలందుకున్న 'మృత్యుంజయుడు' నాటిక



మృత్యుంజయుడు నాటికలోని సన్నివేశం

పెదకాకాని: జాతీయ స్థాయి నాటికల పోటీల్లో ఉత్తమ ద్వితీయ ప్రదర్శన బహుమతిని గ్రామీణ కళాకారుల ఐక్యవేదిక, వెనిగండ్ల వారి మృత్యుంజయుడు నాటిక సొంతం చేసుకుంది. తొలి ప్రయత్నంలోనే మూడు బహుమతులు సాధించి పలువురి కళాకారుల మన్ననలు పొందింది. భీమవరంలో కళారంజని నాటక అకాడమి ఆధ్వర్యంలో 12వ జాతీయస్థాయి నాటిక పోటీలు జరిగాయి. ఈనెల 16వ తేది నుంచి మూడు రోజుల పాటు జరిగిన ఈ పోటీల్లో 18వ తేదీ మంగళవారం రాత్రి చివరిగా వెనిగండ్లకు చెందిన గ్రామీణ కళాకారుల ఐక్యవేదిక వారి మృత్యుంజయుడు నాటిక ప్రదర్శించారు. ఈ మూడు రోజుల ప్రదర్శనల్లో ఉత్తమ ద్వితీయ నాటికగా అంజూరి నర్సిరెడ్డి రచన, దర్శకత్వంలో ప్రదర్శించిన మృత్యుంజయుడు ఎంపికై ంది. ఉత్తమ దర్శకుడిగా, ఉత్తమ కేరక్టర్ ఆర్టిస్టుగా బ్రహ్మయ్య పాత్రధారి అంచూరి నర్సిరెడ్డి రెండు బహుమతులు అందుకుని కళారంగంలో తమ ప్రతిభను ప్రదర్శించారు. తొలి ప్రదర్శనలోనే ఉత్తమ ద్వితీయ ప్రదర్శన, ఉత్తమ దర్శకత్వం, ఉత్తమ కేరెక్టర్ ఆర్టిస్టు అవార్డులు సొంతం చేసుకుంది. ఈ సందర్భంగా నాటిక దర్శకుడు, రచయిత, నటుడు అంచూరి నర్సిరెడ్డిని పలువురు కళా ప్రియులు, అభిమానులు అభినందించారు.

భర్త నుంచి ప్రాణహాని ఉంది.. కాపాడండి !

పోలీసులకు ఓ వివాహిత ఫిర్యాదు

పెదకాకాని: భర్త నుంచి ప్రాణహాని ఉంది.. రక్షించండి! అంటూ ఓ వివాహిత బుధవారం పోలీసుల్ని ఆశ్రయించింది. పోలీసులు కథనం ప్రకారం.. పెదకాకాని మండలం గడ్డిపాడు గ్రామానికి చెందిన కాండ్రు నీలిమకు చిన్నతనంలోనే తల్లిదండ్రులు చనిపోవడంతో నాయనమ్మ, తాతయ్యలు పెంచి పెద్ద చేశారు. 2010లో అదే ప్రాంతానికి చెందిన కాండ్రు జాన్‌బాబుతో వివాహం జరిపించారు. వారికి ఇద్దరు పిల్లలున్నారు. జాన్‌బాబు వేరొక మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకుని శారీరకంగా, మానసికంగా హింసిస్తున్నాడు. అతని వేధింపులు భరించలేక కొద్దిరోజులకు నీలిమ అనారోగ్యానికి గురికావడంతో తాతయ్య, నాయనమ్మలు ఆసుపత్రిలో చూపించి ఇంట్లోనే ఉంచుకుని పోషిస్తున్నారు. ఈ సమయంలో ఇంటికి రావాలని భర్త బంధువులు గొడవ చేశారు. 2021 సెప్టెంబరు 8న జాన్‌బాబు బకెట్‌లో పెట్రోల్ తీసుకు వచ్చి నీలిమ నాయనమ్మపై పోసి నిప్పు అంటించాడు. కళ్లముందే నాయనమ్మను చంపాడని నీలిమ భర్తపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. జైలు నుంచి బెయిల్‌పై వచ్చిన భర్త మేనమామ ఇంట్లో ఉంటున్న నీలిమ వద్దకు వచ్చి బాగా చూసుకుంటానని నమ్మించాడు. ఇన్నర్ రింగ్ రోడ్డులోని నాగబాల అపార్ట్‌మెంటులో ప్లాట్ అద్దెకు తీసుకున్నాడు. ఈ సమయంలో భర్త పెట్టే బాధలు భరించలేక నీలిమ నాలుగు సార్లు పెదకాకాని పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కౌన్సెలింగ్ ఇచ్చారు. అయినప్పటికీ జాన్‌బాబులో ఎటువంటి మార్పు రాకపోగా కొట్టి చిత్రహింసలకు గురిచేశాడు. ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యం చేయించుకుని నీలిమ మళ్లీ పోలీసులకు ఫిర్యాదు చేసింది. జాన్‌బాబు 2023 ఫిబ్రవరి 23న పాత గుంటూరు పోలీసుస్టేషన్‌లోని ప్రగతీనగర్‌లో జరిగిన 50 లక్షల బంగారం చోరీ రికవరీ కేసులో ప్రధాన నిందితుడు. తనకు భర్త జాన్‌బాబు వల్ల ప్రాణహాని ఉందని, అతన్ని పిలిపించి విచారించి తన జోలికి రాకుండా చూడాలని నీలిమ తాజాగా పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ బండారు సురేష్‌బాబు తెలిపారు.

కారుతో బీభత్సం- ఆటో ధ్వంసం



ప్రమాదానికి కారణమైన శ్రీకాంత్, కారు

గుంటూరు రూరల్: కారుతో ఓ వ్యక్తి బీభత్సం సృష్టించిన ఘటన బుధవారం నల్లపాడు పోలీసు స్టేషన్ పరిధిలో చేసుకుంది. ప్రకాశం జిల్లా బల్లికురవ మండలం కొమ్మినేనివారిపాలెం గ్రామానికి చెందిన ధూళిపాళ్ల శ్రీకాంత్ కారులో గుంటూరు వచ్చాడు. ఈ క్రమంలో గార్డెన్ సెంటర్‌లో ఎదురుగా వెళుతున్న కారును ఢీకొట్టడంతో అందులో ఉన్న వ్యక్తి శ్రీకాంత్ కారును వెంబడించాడు. ఆ తర్వాత ఆర్టీవో కార్యాలయం వైపు వేగంగా వెళుతూ శ్రీకాంత్ ఎదురుగా వస్తున్న జన్మభూమి కాలనీకి చెందిన ఎం. మహేష్‌కు చెందిన ఆటోను ఢీకొన్నాడు. ప్రమాదంలో ఆటో ధ్వంసం కాగా, డ్రైవర్ మహేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. అదే స్పీడ్‌తో వెళుతూ ఆర్టీవో కార్యాలయానికి చెందిన గోడను ఢీకొన్నాడు. స్థానికులు శ్రీకాంత్‌ను పట్టుకుని దేహశుద్ధి చేశారు. సంఘటన తెలుసుకున్న పోలీసులు అతడ్ని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

బీసీల ఆశాజ్యోతి సర్దార్ గౌతు లచ్చన్న



పెదకాకాని: బడుగు, బలహీనవర్గాల ఆశాజ్యోతి సర్దార్ గౌతు లచ్చన్న అని ప్రముఖ న్యాయవాది కారంకి లక్ష్మీనారాయణ తెలిపారు. పెదకాకానిలో సెంటర్‌లో బుధవారం గౌతు లచ్చన్న 17వ వర్ధంతిని పురస్కరించుకుని విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ముందుగా ఆయన చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కారంకి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ స్వాతంత్రోద్యమంలో గౌతు లచ్చన్న ప్రముఖ పాత్ర పోషించారని గుర్తు చేశారు. సర్దార్ వల్లబాయి పటేల్ తరువాత సర్దార్‌గా పిలువబడే వ్యక్తి లచ్చన్న అని కొనియాడారు. ప్రకాశం పంతులు, బెజవాడ గోపాలరెడ్డి మంత్రి వర్గంలో మంత్రిగా పని చేశారని తెలిపారు. కార్యక్రమంలో ఎస్సీ ఎస్టీ, బీసీ నాయకులు లింగంగుంట సాల్మన్‌రాజు, ఆత్మకూరి వెంకటేశ్వర్లు, కుక్కల రామ్‌ప్రసాద్, క్రోసూరి పూర్ణచంద్రరావు, దర్శి భాస్కరరావు, రేఖ ప్రసాద్, కుక్కల నాగమల్లేశ్వరరావు, పాగోలు గోపి, దోసపాటి శ్రీకాంత్ , కుక్కల సోమేష్, ఉప సర్పంచి వలివేటి మురళీకృష్ణ, డాక్టర్ ఉప్పాల శివాజీ, కోసూరి శివరామకృష్ణ పాల్గొన్నారు.

రేటూరు సొసైటీ చైర్మన్‌గా వల్లూరి పండు



రేటూరు(కాకుమాను): మండలంలోని రేటూరు వ్యవసాయ పరపతి సంఘం చైర్మన్‌గా గ్రామానికి చెందిన వల్లూరి పండుని నియమిస్తూ జిల్లా అధికారుల నుంచి ఉత్తర్వులు వచ్చినట్లు సొసైటీ కార్యదర్శి రాజేష్ బుధవారం తెలిపారు.ఈ సందర్భంగా నూతనంగా చైర్మన్ పదవి పొందిన పండు మాట్లాడుతూ సొసైటీ పరిధిలోని రైతులకు అందుబాటులో ఉంటూ వారికి ఎరువుల్ని సకాలంలో అందించే విధంగా కృషి చేస్తానని చెప్పారు. తనకు పదవి రావడానికి కృషి చేసిన ప్రత్తిపాడు శాసన సభ్యురాలు మేకతోటి సుచరితకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం కార్యాలయ సిబ్బంది, గ్రామస్తులు ఆయన్ను పూలమాలలతో అభినందించారు.

మసీదుల్లో పండ్లు, లస్సీ పంపిణీ

పొన్నూరు(చేబ్రోలు): పవిత్ర రంజాన్ పండుగను పురస్కరించుకొని పట్టణంలోని 17 మసీదుల్లో ఆంధ్ర ముస్లిం లీగ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అల్తాఫ్ రెహమాన్ మురాది పండ్లు, లస్సీని బుధవారం పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ సర్వ మతాలు ఒకటే అన్న నినాదంతో ఆంధ్ర ముస్లిం లీగ్ పార్టీ స్థాపించినట్లు చెప్పారు. తన తల్లి షేక్ ముంతాజ్ బేగం జ్ఞాపకార్థం పండ్లు, లస్సీలను పంపిణీ చేసినట్లు తెలిపారు. ముస్లింలకు ఆయన రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ముస్లిం లీగ్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థిని అదృశ్యం

చేబ్రోలు: పాఠశాలకు వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి వెళ్లిన విద్యార్థిని అదృశ్యంపై బుధవారం చేబ్రోలు పోలీసులు కేసు నమోదు చేశారు. మండల పరిధిలోని నారాకోడూరు గ్రామానికి చెందిన దానబోయిన రుక్మిణి(15) తెనాలిలోని ఓ ప్రైవేటు పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. మంగళవారం ఉదయం 11గంటలకు స్కూలుకు వెళ్తున్నాని చెప్పి బ్యాగ్ తీసుకొని ఇంటి నుంచి వెళ్లింది. తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు బంధువులు, పరిసర ప్రాంతాల్లో గాలించినప్పటికీ ఆచూకీ లభించలేదు. బాలిక తండ్రి రాంబాబు ఫిర్యాదు మేరకు చేబ్రోలు ఏఎస్ఐ ఎస్ వెంకటేశ్వర్లు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఆడిటర్ అప్పారావుకు నివాళి



గుంటూరు రూరల్: ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాల జాయింట్ సెక్రటరీ, నాగార్జున ఎడ్యుకేషనల్ సొసైటీ పాలక మండలి సభ్యుడు, ఆడిటర్ బి.వి.అప్పారావు ఆకస్మిక మృతికి బుధవారం ఆర్‌వీఆర్‌జేసీ కళాశాల, నాగార్జున ఎడ్యుకేషనల్ సొసైటీ పాలకమండలి సభ్యులు సంతాపం వ్యక్తం చేశారు. అప్పారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్. శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ మద్దినేని జగదీష్, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ ఆర్. గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె. కృష్ణప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ కె. శ్రీనివాస్, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ కె. రవీంద్ర పాల్గొన్నారు.